# నమస్తే తెలంగాణ
# కామారెడ్డి

5 | నిజామాబాద్, మంగళవారం 17 సెప్టెంబర్ 2024 | KAMAREDDY


- పోలీసుల పటిష్ట బందోబస్తు
- అడుగడుగునా బలగాల మోహరింపు
- ఈసారి ఉమ్మెడకు భారీ విగ్రహాల తరలింపు
- బాసర వైపు వెళ్లే మార్గంలో ఆంక్షలు

## శోభాయాత్రకు ముస్తాబు

### నిమజ్జనానికి తరలనున్న గణపయ్య

భాద్రపద శుద్ధ చతుర్దశి మంగళవారం మధ్యాహ్నం 2గంటలకు నిజామాబాద్‌లో గణేశ్ నిమజ్జన శోభాయాత్ర ప్రారంభం కానున్నది. 10 జతల ఎడ్లతో నగరంలోని దుబ్బ మహాలక్ష్మి ఆలయ ప్రాంగణం వద్ద రథానికి పూజలు చేసి శోభాయాత్రను ప్రారంభించనున్నారు. గుర్బాబాదీ రోడ్, నాందేవ్‌వాడ, శివాజీ చౌరస్తా, రైల్వేగేట్, గాంధీచౌక్, బర్కత్‌పుర, గురుద్వార్, పెద్దబజార్ మీదుగా కోటగల్లి, జెండాగల్లి, గోల్‌హనుమాన్, పాట్‌గల్లి, పూలాంగ్ చౌరస్తా మీదుగా వినాయకుల బావి వద్దకు సుమారు 6 కి.మీ. మేర శోభాయాత్ర కొనసాగనున్నది. రాత్రి 11.30 గంటల లోపు నిమజ్జన ప్రక్రియ ముగియనున్నది.

**ఈసారి 'రూట్' మార్పు..**

నిజామాబాద్‌లో చిన్న వినాయక ప్రతిమలను గణపతుల బావిలో నిమజ్జనం చేస్తుండగా, భారీ విగ్రహాలను బాసర గోదావరి వద్దకు తరలించే వారు. అయితే, ఈసారి 8 అడుగుల కంటే ఎత్తు ఉన్న విగ్రహాలను ఉమ్మెడ వద్ద గోదావరిలో నిమజ్జనం చేయనున్నారు. జాన్కంపేట్‌లో బ్రాడ్ గేజ్ రైలు హై టెన్షన్ రైల్వే లైన్ కారణంగా ఎత్తున్న విగ్రహాలను బాసర గోదావరికి తీసుకెళ్లకుండా నిషేధం విధించినట్లు సీపీ కల్మేశ్వర్ సింగేనవార్ తెలిపారు. 8 ఫీట్ల లోపు ఉన్న విగ్రహాలను పాత రూటు ప్రకారం నెహ్రూపార్క్, అర్సపల్లి, జాన్కంపేట్, నవీపేట్ మీదుగా బాసరకు వెళ్లవచ్చన్నారు. అంతకు మించి ఎత్తున్న ప్రతిమలను పూలాంగ్, ధర్నా చౌక్, రైల్వే స్టేషన్, బస్టాండ్, రైల్వే ఓవర్ బ్రిడ్జి, శివాజీ చౌక్, దుబ్బ, జీజీ కాలేజీ చౌరస్తా, బైపాస్ రోడ్డు, కంఠేశ్వర్ బైపాస్ చౌరస్తా, ముబారక్ నగర్, మాణిక్ బండార్, దాస్ నగర్, మాక్లూర్, ఆంధ్రనగర్, నందిగుట్ట మీదుగా ఉమ్మెడ గోదావరి వంతెనకు చేరుకోవాలని సీపీ సూచించారు. ఈ మేరకు మండపాల నిర్వాహకులు సహకరించాలని కోరారు.

**రాకపోకల మళ్లింపు..**

శోభాయాత్ర సందర్భంగా బాసర గోదావరి వంతెన వద్ద రాకపోకలపై ఆంక్షలు విధించారు. మంగళ, బుధవారాల్లో ఈ ఆంక్షలు అమలులో ఉంటాయని అదనపు కలెక్టర్ కిరణ్ కుమార్ వెల్లడించారు. నిజామాబాద్ నుంచి బాసర వెళ్లే వాహనాలు నవీపేట్, కల్యాపూర్, దండిగుట్ట, వీరన్న గుట్ట, రెంజల్ కమాన్ ఎక్స్ రోడ్, సాటాపూర్ ఎక్స్‌రోడ్, నీల పేపర్ మిల్, కందకుర్తి వంతెన మీదుగా ధర్మాబాద్, బిద్రెల్లి నుంచి బాసరకు వెళ్లాలని సూచించారు. అలాగే బాసర నుంచి నిజామాబాద్ వచ్చే వాహనాలు సైతం అదే మార్గంలో రావాలని పేర్కొన్నారు. నిమజ్జనానికి వచ్చే వాహనాలు కూడా ఇలాగే వెళ్లాల్సి ఉంటుందని తెలిపారు.

**నవరాత్రులు భక్తుల పూజలందుకున్న**

లంబోదరుడు నేడు (మంగళవారం) గంగమ్మ చెంతకు చేరనున్నాడు. వీధివీధినా కొలువైన వినాయకుడు శోభాయాత్రగా నిమజ్జనానికి తరలనున్నాడు. ఈ నెల 7వ తేదీన ప్రారంభమైన గణపయ్య ఉత్సవాలు మంగళవారంతో పరిపూర్ణం కానున్నాయి. కామారెడ్డిలో సోమవారం రాత్రి వినాయక శోభాయాత్ర ప్రారంభం కాగా, నిజామాబాద్‌లో మంగళవారం మధ్యాహ్నం నుంచి మొదలు కానుంది. జిల్లా కేంద్రాలతో పాటు పల్లెల్లోనూ నిమజ్జనోత్సవ ర్యాలీలతో సందడి నెలకొంది. మరోవైపు, శోభాయాత్రల సందర్భంగా అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా పోలీసు శాఖ పటిష్ట బందోబస్తును ఏర్పాటు చేసింది. అడుగడుగునా సిబ్బందిని మోహరించింది.

–సుభాష్‌నగర్/వినాయక్‌నగర్, సెప్టెంబర్ 16



**మద్యం షాపులు బంద్**

నిజామాబాద్ కమిషనరేట్ పరిధిలో గణేశ్ నిమజ్జన శోభాయాత్ర సందర్భంగా నేడు మద్యం షాపులు, బార్లు, కల్లు బట్టీలు, డిపోలు మూసివేయనున్నట్లు సీపీ కల్మేశ్వర్ తెలిపారు. బుధవారం ఉదయం 10 గంటల వరకు మద్యం విక్రయాలు నిలిపి వేస్తున్నట్లు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఎవరైనా మద్యం విక్రయిస్తున్నట్లు తెలిస్తే వారిపై 20(1) ఆఫ్ తెలంగాణ ఎక్సైజ్ యాక్ట్ 1968 ప్రకారం కఠిన చర్యలు తీసుకోనున్నట్లు సీపీ హెచ్చరించారు.

## శోభాయమానంగా..





కామారెడ్డిలో శోభాయాత్రను ప్రారంభిస్తున్న కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్, ఎస్పీ సింధూశర్మ.. గణపయ్యలను చూసేందుకు వచ్చిన జనం

- కామారెడ్డిలో గణేశ్ శోభాయాత్ర
- జెండా ఊపి ప్రారంభించిన కలెక్టర్, ఎస్పీ
- భారీగా తరలివచ్చిన భక్తులు

కామారెడ్డి, సెప్టెంబర్ 16: కామారెడ్డి జిల్లా కేంద్రంలో వినాయక శోభాయాత్ర అట్టహాసంగా ప్రారంభమైంది. సిరిసిల్ల రోడ్‌లోని యువజన సమైక్య గణేశ్ మండలి వాహనం వద్ద కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్, ఎస్పీ సింధూ శర్మ, మున్సిపల్ చైర్ పర్సన్ ఇందుప్రియ సోమవారం రాత్రి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం జెండా ఊపి శోభాయాత్రను ప్రారంభించారు. వేలాది భక్తుల జయజయ ధ్వానాల నడుమ బొజ్జ గణపయ్య నిమజ్జనానికి బయల్దేరాడు. బ్యాండ్ మేళాలు, డీజే చప్పుళ్లు, యువతీయువకుల నృత్యాల తో కోలాహలం నెలకొంది. సిరిసిల్ల రోడ్ నుంచి మొదలైన శోభాయా త్ర స్టేషన్ రోడ్, సుభాష్ రోడ్, వీక్లీ మార్కెట్ రోడ్, పాంచ్ చౌరస్తా మీదుగా గోపాలస్వామి రోడ్, పెద్ద బజార్, రైల్వే కమాన్, నిజాంసాగర్ చౌరస్తా, కొత్త బస్టాండ్ నుంచి టేక్రియాల్ చెరువు వరకు కొనసాగనున్నది. నిమజ్జన కార్యక్రమం మంగళవారం సాయంత్రానికి పూర్తి కానున్నది. విశ్వ హిందూ పరిషత్, బజరంగ్‌దళ్ సభ్యులు, యువజన సంఘాల ప్రతినిధులు ఉత్సా హంగా పాల్గొన్నారు.



జంగంపల్లిలో ఎద్దుల బండిపై వినాయకుడి శోభాయత్ర



లింగంపేట్ మండలం శెట్పల్లిలో నిమజ్జనానికి తరలుతున్న వినాయకులు

## వీడియో కాల్ చేసి.. రూ.1.40 లక్షలు కొట్టేశారు



### సైబర్ మోసగాళ్ల కొత్త తరహా దోపిడీ

వినాయక్‌నగర్, సెప్టెంబర్ 16: సైబర్ నేరగాళ్లు కొత్త ఎత్తులతో జనాల్ని బురిడీ కొట్టిస్తున్నారు. తాజాగా ఓ వ్యక్తికి వీడియో కాల్ చేసి రూ.1.40 లక్షలు లూటీ చేశారు. నిజామాబాద్ రెండో టౌన్ ఎస్సై యాసిన్ అరాఫతి కేసు వివరాలను సోమవారం వెల్లడించారు. నగరంలోని బర్కత్‌పురా ప్రాంతానికి చెందిన మొహమ్మద్ ముజాహిద్‌కు సోమవారం అజ్ఞాత వ్యక్తి కాల్ చేశాడు. నేను బ్యాంక్ నుంచి మాట్లాడుతున్నా. మీరు లోన్ కోసం అప్లై చేసుకున్నారు కదా. మీకు లోన్ అప్రూవ్ అయిందని నమ్మించాడు. కాసేపట్లో వీడియో కాల్ చేస్తా. లిఫ్ట్ చేయగానే మీ వివరాలన్నిమాకు వచ్చేస్తాయని అజ్ఞాత వ్యక్తి చెప్పాడు. అందుకు సరేనన్న ముజాహిద్.. వీడియో కాల్ రాగానే లిఫ్ట్ చేశాడు. ఆ తర్వాత కొన్ని క్షణాల్లోనే అతడి ఖాతా నుంచి రూ.1.40 లక్షలు ట్రాన్స్‌ఫర్ అయిపోయాయి. కొద్దిసేపటి తర్వాత ఈ విషయం తెలుసుకున్న బాధితుడు టూ టౌన్ పోలీసులను ఆశ్రయించాడు. ముజాహిద్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

## వేడుకలకు ముస్తాబైన కలెక్టరేట్



ఏర్పాట్లను పరిశీలిస్తున్న నిజామాబాద్ కలెక్టర్, సీపీ, అధికారులు

కంఠేశ్వర్, సెప్టెంబర్ 16: నిజాం పాలన నుంచి సెప్టెంబర్ 17వ తేదీన తెలంగాణకు విముక్తి లభించిన సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం నేడు ప్రజాపాలన దినోత్సవాలను నిర్వహించనున్నది. ఈ నేపథ్యంలో ఉమ్మడి జిల్లాలోని సమీకృత కలెక్టరేట్ కార్యాలయాలను ముస్తాబు చేశారు. మంగళవారం ఉదయం 10 గంటలకు నిజామాబాద్‌లో ఖనిజాభివృద్ధి సంస్థ చైర్మన్ అనిల్, కామారెడ్డిలో టూరిజం కార్పొరేషన్ చైర్మన్ పటేల్ రమేశ్ రెడ్డి జాతీయ జెండాలను ఆవిష్కరించనున్నారు. ప్రజాప్రతినిధులు, ప్రముఖులు హాజరు కానున్న నేపథ్యంలో రెండు జిల్లాల కలెక్టర్లు రాజీవ్‌గాంధీ హనుమంతు, ఆశీష్ సాంగ్వాన్ ఏర్పాట్లను పరిశీలించారు. సీపీ కల్మేశ్వర్, నిజామాబాద్ మున్సిపల్ కమిషనర్ మకరంద్, అదనపు కలెక్టర్ కిరణ్‌కుమార్ తదితరులు ఆయన వెంట ఉన్నారు.




**ఘనంగా మిలాద్ ఉన్ నబీ**

మహ్మద్ ప్రవక్త జన్మదినం సందర్భంగా ఉమ్మడి జిల్లాలోని ముస్లింలు సోమవారం మిలాద్ ఉన్ నబీ వేడుకలను ఘనంగా నిర్వహించారు. నిజామాబాద్ జిల్లా కేంద్రంలో భారీ ర్యాలీలో వేలాది ముస్లింలు పాల్గొన్నారు. మత పెద్దలు ప్రవక్త జన్మదిన ప్రాముఖ్యతను వివరించారు.


## ఆబ్కారీ అవినీతి స్టోరీ

- మద్యం దుకాణాల నుంచి నెలవారీ మామూళ్లు
- గిరాకీతో సంబంధం లేకుండా భారీగా టార్గెట్లు
- విలవిల్లాడుతున్న మద్యం వ్యాపారులు
- 'నమస్తే తెలంగాణ' కథనంపై జోరుగా చర్చ
- ఎక్సైజ్ శాఖ అక్రమాలపై ఇంటెలిజెన్స్ అధికారుల ఆరా

**తవ్విన కొద్దీ వెలుగులోకి అక్రమాలు**



నిజామాబాద్, సెప్టెంబర్ 16 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) ఆబ్కారీ శాఖలో అవినీతికి అంతే లేకుండా పోయింది. అన్ని స్థాయిల్లోనూ దోపిడీ పర్వం కొనసాగుతున్నది. తవ్విన కొద్దీ అనేక అక్రమాలు బయట పడుతున్నాయి. ఎక్సైజ్ అధికారుల వేధింపులు ఒక్కొక్కటిగా వెలుగులోకి వస్తున్నాయి. మరోవైపు, ఎక్సైజ్‌శాఖలో కొనసాగుతున్న వ్యవహారంపై 'ఆబ్కారీలో అవినీతం' పర్వం శీర్షికన నమస్తే తెలంగాణ సోమవారం ప్రచురించిన కథనం చర్చనీయాంశంగా మారింది. ఆ శాఖ ఉద్యోగుల్లోనైతే కలకలం రేపింది. ఎక్సైజ్ కమిషనర్ కార్యాలయానికి ఫిర్యాదులు రావడంతో కలెక్టర్‌ను వివరణ అడిగినట్లు సమాచారం. ఈ నేపథ్యంలో మంగళవారం ఉదయమే రంగంలోకి దిగిన కలెక్టర్ సంబంధిత శాఖ అధికారులపై తీవ్ర అసహనం వ్యక్తం చేసినట్లు సమాచారం. మరోవైపు, నిఘా వర్గాలు సైతం 'నమస్తే' కథనం ఆధారంగా విచారణ చేపట్టాయి. ఇంటెలిజెన్స్‌తో పాటు స్పెషల్ బ్రాంచ్ పోలీసులు సైతం ఆబ్కారీ అవినీతి పర్వంపై ఆరా తీశారు. ఎస్‌హెచ్‌వోలు బరితెగించి అక్రమాలకు పాల్పడుతుంటే ఉన్నతాధికారులు ఎందుకు మౌనంగా ఉంటున్నారన్న కోణంపై దృష్టి పెట్టారు. పూర్తి స్థాయి నివేదికను ప్రభుత్వానికి సమర్పించనున్నట్లు తెలిసింది.



**గొలుసుకట్టు దోపిడీ..**

మద్యం దుకాణాల నుంచి విచ్చలవిడిగా వసూళ్లు చేస్తున్నారు. ప్రతి దుకాణానికీ భారీగా టార్గెట్లు పెట్టి సంబంధిత ఎస్సైలు, సీఐలు బహిరంగంగానే నెలవారీగా మామూళ్లు తీసుకుంటున్నారని మద్యం షాపుల నిర్వాహకులు వాపోతున్నారు. డబ్బు లు ఇవ్వకపోతే తనిఖీలు, దాడుల పేరుతో ఇబ్బంది లు సృష్టిస్తున్నారంటూ ఆర్మూర్, బాల్కొండ నియోజకవర్గాలకు చెందిన కొందరు వ్యాపారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తే కేసులు పెట్టి వేధిస్తారన్న భయంతో మామూళ్లు ముట్టజెబుతున్నట్లు పేర్కొంటున్నారు. మరోవైపు, భారీగా విక్రయాలు జరిపే దుకాణాలకు దీటుగా చిన్న షాపుల నుంచి మామూ ళ్లు ఆశించడం కరెక్ట్ కాదని, తాము డ బ్బులు ఇచ్చుకోలేమని కొందరు వ్యా పారులు జిల్లా స్థాయి అధికారులను కలిసి చేతులెత్తి విన్నవించుకున్నా కనికరం చూపలేదని వాపోతున్నారు. కింది నుంచి పైస్థాయి వరకూ అందరికీ అవినీతిలో వాటా ఉందని చెబుతున్నారు.

**ఎన్‌ఫోర్స్‌మెంట్ కథే వేరు**

ఎక్సైజ్ శాఖలో ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం కీలకమైనది. గత ప్రభుత్వం ఈ విభాగం ద్వారా నిరంతర తనిఖీలతో అక్రమ వ్యవహారాలకు అడ్డుకట్ట వేసింది. కానీ, ఇప్పుడు నామ్‌కే వాస్తే అన్నట్లుగా తయారైందన్న విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. ఉమ్మడి జిల్లాలో సగానికంటే ఎక్కువ మద్యం దుకాణాలు అనర్హుల చేతుల్లో ఉన్నాయి. ఎక్సైజ్ పాలసీ ప్రకారం టెండర్లలో దుకాణాలను దక్కించుకున్న వారే మద్యం వ్యాపారం చేయాలి. కానీ అందుకు భిన్నంగా వైన్ షాపులను గుడ్ విల్ పేరుతో గంపగుత్తగా చేజిక్కించుకుంటున్న కొందరు.. ఆబ్కారీ శాఖకే సవాల్ విసురుతున్నారు. వీరితో ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం అధికార గణం చేతులు కలిపి మిన్నకుండిపోతుందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత తూతూ మంత్రంగా ఎన్‌ఫోర్స్‌మెంట్ తనిఖీలు చేసింది. ఆర్మూర్ డివిజన్ పరిధిలో ఓ వైన్ షాపుపై కేసు నమోదు చేసి ఫైల్‌ను మూవ్‌మెంట్ చేసేందుకు సంబంధిత అధికారులు మామూళ్లకు ఆశపడడం పెద్ద దుమారమే రేపింది. నిబంధనల మేరకు జరిమానా విధించి తదితర చట్టపరమైన విధానాన్ని వర్తింపజేయాల్సి ఉండగా ఉద్దేశపూర్వకంగా జాప్యం చేసి చెడ్డపేరును మూటగట్టుకున్నారు. బయటికి రాని ఇలాంటి అవినీతి కథలు ఎన్నో ఉన్నాయి.

## అమరేశం రాజేశ్వర శర్మ కన్నుమూత



అమరేశం రాజేశ్వర శర్మ(ఫైల్)

సుభాష్‌నగర్, సెప్టెంబర్ 16 : సంస్కృతాంధ్ర విద్వాంసుడు, చరిత్ర పరిశోధకుడు, కాకతీయ విశ్వవిద్యాలయ మాజీ డీన్ డాక్టర్ ఆచార్య అమరేశం రాజేశ్వర శర్మ (86) అనారోగ్యంతో కన్నుమూశారు. ఆదివారం అర్ధరాత్రి హైదరాబాద్‌లోని తన స్వగృహంలో తుదిశ్వాస విడిచారు. కామారెడ్డిలో 1930 సెప్టెంబర్ 5న సరస్వతి – రాజలింగం సభాపతి దంపతులకు మొదటి సంతానంగా జన్మించిన రాజేశ్వర శర్మ.. ఓయూ ఆధ్వర్యంలో కామారెడ్డిలో కొనసాగుతున్న సాయం ప్రాచ్యకళాశాల వ్యవస్థాపకులు. ఈ కళాశాల ద్వారా వేలాది మందికి తెలుగుభాష, వ్యాకరణం తదితర అంశాలపై విద్యాభ్యాసం నేర్పారు. నన్నెచోడుని కవిత్వం, వేదం వెంకటరాయ శాస్త్రి రూపక సమాలోచనం, అహోబల, ఆంధ్ర వ్యాకరణ వికాసం, వైకృత చంద్రికాంధ్ర వివరణ, చైత్రపుటలు, శ్రీసాయి సచ్చరిత్ర ముక్తావళి, గజ్జెల విస్తరి, ఆత్మ నివేదన తదితర రచనలు చేశారు. అమరేశం మృతికి కవులు, రచయితలు ప్రకాశ్‌శర్మ, వీపీ చందన్‌రావు, కాసర్ల నరేశ్‌రావు, భోజన్నగారి అనసూయ, చంద్రశేఖర్ శర్మ, ఓంప్రకాశ్, బ్రాహ్మణ సంఘాలు సంతాపం తెలిపాయి.